గంగ తెప్పోత్సవం



మహాత్మానగర్‌లో గంగ తెప్పోత్సవ ర్యాలీని ప్రారంభించిన బిజ్జి కనకేష్‌కుమార్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మనగర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగ తెప్పోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని గంగపుత్ర సంఘం అధ్యక్షులు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్ స్థానికంగా ఉన్న బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో జాలర్లు, బోనాలు, పోతరాజులు, కళాకారుల నృత్య ప్రదర్శనతో ర్యాలీని ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజ్జి కనకేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గంగ తెప్పోత్సవ ర్యాలీని నిర్వహిస్తు గంగపుత్రుల ఐక్యతను పెంపొందిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో మహాత్మానగర్ గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, నాయకులు పెంటం రాములు, యాదయ్య, అంజయ్య, రాజయ్య, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.రాజేందర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక వీరన్న గుట్టలో గంగ తెప్పోత్సవంలో కార్పొరేటర్లు

గోల్నాక వీరన్న గుట్టలో...

అంబర్‌పేట: గంగపుత్రుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గంగ తెప్పోత్సవం వైభవంగా జరిగింది. గోల్నాక వీరన్న గుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు బీ.పద్మావెంకట్ రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, అమృతలతో పాటు పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. వైభవంగా నిర్వహించిన తెప్పోత్సవ ర్యాలీ వీరన్న గుట్ట నుంచి ట్యాంక్ బండ్ వరకు సాగింది.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

లిబర్టీ: తెలంగాణ ఆత్మగౌరవ పతాక సర్దార్ పాపన్నగౌడ్ అని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి అన్నారు. వీరోచితంగా పోరాడిన సర్దార్ పాపన్నగౌడ్ చరిత్రలో నిలిచిపోయారని నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని ఆయన గుర్తు చేశారు. పాపన్నగౌడ్ 374వ జయంతిని పురస్కరించుకొని దళ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసి తన పోరాట పటిమతో శత్రుమూకలను గడగడలాడించారని స్పష్టం చేశారు. సర్దార్ పాపన్నగౌడ్ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. అంతేకాకుండా పాపన్నగౌడ్ వీరోచిత పోరాటాన్ని జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టి విద్యార్థులకు బోధించాలని ఆయన కోరారు.

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై తీర్పును ఉపసంహరించుకోవాలి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దళిత జాతి రాజ్యాధికారం ను సాధించకుండా.. అణిచివేయాలని మనువాద పాలక పార్టీలు సామాజిక కుట్రలు చేశాయన్నారు. ఇందులో భాగంగా వర్గీకరణ అంశం అని తెలిపారు. రాజ్యాంగం ను రిజర్వేషన్‌లను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా పాలక మనువాద ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా 21న దేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద పోరాట ర్యాలీలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. గవ్వల శ్రీకాంత్, డాక్టర్ వీఎల్ రాజు, జెఎస్‌రావు, భాస్కర్ రావు, పసుల రాజలింగం, గవ్వల శ్రీకాంత్, ఎస్.అశోక్, దూల్లే వెంకటేష్, ఎస్.వసంతరావు, గోలి నరేష్, సుబ్బారావు, ఆర్ల రమేష్, భూపల్లి హేమలత తదితరులు పాల్గొన్నారు.

జరిమానాలు విధించినా.. జంకడం లేదు..!

7 నెలల్లో లక్షన్నర దాటిన కేసులు





హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతున్న స్కూటరిస్టుకు జరిమానా విధిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

- హెల్మెట్ ధరించకుండా పట్టుబడ్డ 1,71,535 మంది
- నిత్యం వాహన తనిఖీల్లో పట్టుబడుతున్న ద్విచక్రవాహనదారులు
- హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకే ప్రమాదం : ఏసీపీ హరిప్రసాద్

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని హెల్మెట్ ఉల్లంఘన కేసులు..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	ఉల్లంఘించిన వారి సంఖ్య
పంజగుట్ట	37,554
ఎస్ఆర్‌నగర్	36327
జూబ్లీహిల్స్	41,396
బంజారాహిల్స్	56,258

బంజారాహిల్స్: శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహన దారులపై ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నా తీరు మాత్రం మారడం లేదు. ప్రతిరోజూ ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు తనిఖీలు చేపడుతూ పెద్దఎత్తున వాహనదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ఇందులో తరచూ పట్టుబడుతున్న వారిలో యువకులే 90 శాతం ఉంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి జులై 31 వరకు ఏడు నెలల వ్యవధిలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హెల్మెట్ లేకుండా బైక్‌లు నడుపుతూ 1,71,538 మంది పట్టుబడ్డారు. వీరందరికీ జరిమానాలు విధించారు. ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో పోలీసులు ఈ తనిఖీలు చేపడుతున్నారు. ప్రతిరోజూ హెల్మెట్ లేని వాహనదారులు 150 మందికి పైగానే ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడుతుండడం గమనార్హం. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రతియేటా పట్టుబడుతున్న వారి సంఖ్య పెరగడమే కానీ, తగ్గుముఖం పట్టడం లేదు. ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నా యువకులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రతిరోజూ తనిఖీలు

హరిప్రసాద్ కట్టా, ఏసీపీ, వెస్ట్‌జోన్ ట్రాఫిక్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. లేకపోతే జరిమానాలు విధించడం జరుగుతుంది. మా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు ఆయా చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మృత్యువాత కూడా పడతారు. వాహనదారులు ఇంటి నుంచి గమ్యస్థానాలకు వెళ్లి తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవాలంటే హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసుకోవాలి. హెల్మెట్ ధరించడం వల్ల ప్ర యోజనాలు, ధరించకపోతే కలిగే నష్టాలు కూడా వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

జరిమానాలు ఇలా..

ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో హెల్మెట్ ధరించకుండా మొదటిసారి పట్టుబడితే రూ.100 జరిమానా విధిస్తారు. అదే నెలలో రెండోసారి కూడా పట్టుబడితే రూ.235, మూడో సారి పట్టుబడితే రూ. 600 జరిమానా విధిస్తారు. ఒకే నెలలో మూడుసార్లు పట్టుబడితే జరిమానాలు ఈ రకంగా విధిస్తున్నారు.

29న గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం

ఫౌండేషన్ చైర్మన్ బెలూర్ యోగీష్ ప్రభు వెల్లడి

కాచిగూడ: గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 29వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బైలూర్ యోగీష్ ప్రభు వెల్లడించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ పెద్దల్లో జ్ఞానం, పిల్లల్లో చైతన్యం తీసుకురావడమే గీతా ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దీనిలో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత శ్లోకాలపై విద్యార్థులకు పోటీలు, భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, జె.డి.లక్ష్మీనారాయణ, అర్చక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బనరస్ బాబా స్వామీజీ, బడేసాబ్, కంట మనోహర్ రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, మనోహర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారం చేసిన దుండగులకు ఉరివేయాలి



భోలక్‌పూర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఐద్వా కమిటీ నాయకులు

ముషీరాబాద్: పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించి ఉరి తీయాలని ఐద్వా, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భోలక్‌పూర్ లేబర్ అడ్డా వద్ద ఈ ఘటనను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు లక్ష్మి, బుచ్చమ్మ, సీఐటీయూ నాయకులు కృష్ణ మాట్లాడుతూ... ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు మల్లేష్, బాబు, ఐద్వా నాయకురాలు అనిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కురుమ మహిళా సమితి ప్రారంభం



తెలంగాణ కురుమ మహిళా సమితి రిజిస్ట్రేషన్ పత్రాలను విడుదల చేస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

కాచిగూడ: తెలంగాణ కురుమ మహిళా సమితిని ఆదివారం హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. ఈ సందర్భంగా కురుమ మహిళా సమితి రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం జాతీయ బీసీ మహిళా సంఘాల జేఏసీ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మితో కలిసి తెలంగాణ కురుమ మహిళా సమితి అధ్యక్షురాలు బైగొండ లలిత మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కురుమలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గొర్రెల పంపిణీలో గొర్రెలు కురుమలకు అందలేదని అన్నారు. కురుమ మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రతి డివిజన్ నుంచి 100 మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి ప్రతి మహిళకు రూ. 5లక్షలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బిత్తుకూరి అంబికా, జడల స్వప్న, గుడిసెల్లా స్రవంతి, బండారి విజయలక్ష్మి, మమత, సాయికుమారి, బెలిగిరి లత, జి.మమత తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తా



ఎన్నికల్లో ఓటు వేసిన అభ్యర్థి వల్లకటి రాజ్‌కుమార్, శోభారాణి, బింగి నవీన్ తదితరులు

ముషీరాబాద్: నగరంలో పద్మశాలి కులస్థుల కోసం శాశ్వత భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న వల్లకటి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలు బోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో జరిగాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న వల్లకటి రాజ్‌కుమార్ ఓటు వేసి మాట్లాడారు రాష్ట్ర వ్యాప్తంగా 48350 మంది సభ్యత్వం గల పద్మశాలి ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందరి మద్దతు తనకే ఉందని విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 శాతం ఓటింగ్ జరిగిందని తెలిపారు. అన్ని నియోజకవర్గాల పద్మశాలి సంఘాల మద్దతుతో విజయం సాధిస్తానన్నారు. ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడి సతీమణి రామశోభారాణి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బింగి నవీన్, నాయకులు లత, బల్లా శ్రీకాంత్, కృష్ణమూర్తి, గుండు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కాచిగూడ: ఓ బాలిక అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ ఇసామియా బజార్‌కు చెందిన కైలాష్ కుమార్తె ఆర్.ఆకృతి (13) ఆదివారం ఇంటినుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు రాలేదు. కుటుంబ సభ్యులు బాలిక కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: కాచిగూడ రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారం 3లోని పిల్లర్ నం.2 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) అనారోగ్యంతో మరణించి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

21న దివ్యాంగుల సమస్యలపై మహాధర్నా



మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేస్తున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల పరిరక్షణకు ఇచ్చిన వివిధ హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 21న మహాధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ సంస్థ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో ఆదివారం ఆయన మహాధర్నాకు కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చేయూత పథకం దివ్యాంగుల పెన్షన్లు రూ.4016 నుంచి రూ.6వేలకు పెంచాలని, రాష్ట్రమంతా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలని, దివ్యాంగులకు కేటాయించిన ఉద్యోగాలు కేలండర్ పద్ధతిలో భర్తీ చేయాలని, దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పటిష్టంగా అమలు చేయాలని, దివ్యాంగులకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 5శాతం కేటాయించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటమోనీ వెంకటేష్‌గౌడ్, వాసుదేవరావు, ప్రేమ్‌కుమార్, సర్ఫుద్దీన్, గౌస్‌ఫియర్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

పంజగుట్ట: మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు చేతులమీదుగా ప్రారంభమై ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వంటి ఎంతోమంది గొప్పవారికి ఆశ్రయం ఇచ్చిన కాచిగూడ (నింబోలి అడ్డ) సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని హాస్టల్ పూర్వ విద్యార్థుల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు బొమ్మెర రామ్మూర్తి, సంగమేశ్వర్, సునీల్‌లు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో చరిత్ర కలిగిన హాస్టల్ కాచిగూడ హాస్టల్ అని దీన్ని ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కూడా సందర్శించడం విశేషమన్నారు. ఈ హాస్టల్‌లో ప్రస్తుత మంత్రులతో పాటు ఎంతో మంది ప్రముఖులు గడిపారని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ తరువాత అంతటి కీలకపాత్ర పోషించిందన్నారు. అలాంటి హాస్టల్ 2019 కరోనా సాకుతో మూసివేయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా హాస్టల్‌ను తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బోయిన శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘం అధ్యక్షుడు పూస నర్సింహ మృతి



పూస నర్సింహ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం మేస్త్రీ కార్మిక సంఘం అధ్యక్షుడు, గంగపుత్ర కాలనీ ఉపాధ్యక్షుడు పూస నర్సింహ(66) ఆదివారం అనారోగ్యంతో గంగపుత్ర కాలనీలోని తన నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కొడుకులు, ఒక కూతరు ఉన్నారు. ఆయన మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు పూస గోరఖ్‌నాథ్, రాంనగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు నాగేందర్, నాయకులు మల్లేష్, జగదీష్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నర్సింహ అంత్యక్రియలు పార్సిగుట్టలోని శ్మశానవాటికలో నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నానని ముషీరాబాద్ నియోజవర్గం ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం సాయంత్రం డివిజన్‌లోని జవహర్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోలక్‌పూర్, కవాడిగూడ డివిజన్‌లకు చెందిన లబ్ధిదారులకు రూ.5,30,500 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన ముఖ్యఅతిథిగా పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నియోజకవర్గంలో అంతర్గత రోడ్లను ఆధునీకరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు వై.శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, వి.శ్యామ్‌యాదవ్, శంకర్ తెలంగాణ హౌస్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్‌రావు, మహ్మద్‌అలీ, శివకుమార్‌యాదవ్, శంకర్ గౌడ్, వల్లాల రవియాదవ్, ప్రవీణ్ ముదిరాజ్, ప్రవీణ్, రహీం, కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల ఆధునీకరణకు కృషి

ముషీరాబాద్: పార్కులను ఆధునీకరించి ప్రజలకు అహ్లాదకర వాతావరణం అందించేందుకు కృషి చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌కు చెందిన గడసంతల శ్రీనివాస్ పద్మారావునగర్ పార్కు అసోసియేషన్ సభ్యునిగా నూతనంగా నియమితులైన సందర్భంగా ఆయనను అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై మాట్లాడారు. బస్తీ, కాలనీ, పార్కుల కమిటీలు సామాజిక బాధ్యతతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పార్కులో శ్రావణమాస అమ్మవారి బోనాల ఉత్సవాలను నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మారావునగర్ పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ యువజన కమిటీ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ ముషీరాబాద్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, నాయకులు



పద్మారావునగర్ పార్కు అసోసియేషన్ సభ్యుడిగా నియమితులైన శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

గాంధీనగర్‌లో పాము కలకలం



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ పరిధిలోని తూనికలు, కొలతల శాఖ కార్యాలయం వెనుక భాగంలో నాగుపాము కనిపించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని పామును పట్టుకున్నారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే స్పందించిన స్నేక్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా 21న భారత్ బంద్



నినాదాలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

పంజగుట్ట: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ సర్వయ్య తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి కో కన్వీనర్‌లు జి.చెన్నయ్య, సి.హెచ్.రాంచదర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న దళితులు, ఆదివాసీల మనోభావాలు, ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉందన్నారు. అన్ని వర్గాలవారి అభిప్రాయాలు తీసుకోకుండా రాజకీయ స్వార్థంతో ఇచ్చిన తీర్పుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పును పున:పరిశీలించి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, వర్గీకరణ చట్టబద్ధంగా చెయ్యాలని, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు, దళితులు, విద్యార్థి సంఘాలు, భారత్ బంద్‌లో పాల్గొని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జి.వినోద్, శ్రీనివాస్, బాలకృష్ణ, వనిత, లింగస్వామి, వెంకటేశ్వర్, మోహన్, బలవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ ప్లాజా వద్ద నిరసన

ఖైరతాబాద్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలని, మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కఠినమైన చట్టాలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పీపుల్స్ ప్లాజా లవ్ హైదరాబాద్ వద్ద ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ స్టూడెంట్స్, డాక్టర్లు పాల్గొన్నారు.